క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం

నెల్లూరు(అర్బన్): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మన ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మన ఆస్పత్రి అధినేత డాక్టర్ మారం సుధాకర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రోగులు, క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి రక్తదాతలుగా మారాలని కోరారు. వేసవి నేపథ్యంలో రక్త నిల్వలు తగ్గడంతో కొరత తీర్చేందుకు రక్తదానం చేసిన మిత్రులు, ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ ఐఎస్ రావు, అజయ్‌కుమార్, రమేష్‌బాబు, దగ్గుపాటి రాధాకృష్ణ, నోవా బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్లు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

నెల్లూరు(క్రైమ్): ఫిర్యాదు అందిన గంటల వ్యవధిలోనే తప్పిపోయిన చిన్నారుల ఆచూకీని గుర్తించి బాధిత తండ్రి చెంతకు నవాబుపేట పోలీసులు సురక్షితంగా చేర్చారు. భగత్‌సింగ్ కాలనీ టిడ్కోహౌస్‌లో సురేష్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయనకు 10, 9 ఏళ్ల కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 19న రాత్రి ఇంటి వద్ద నుంచి ఎటో వెళ్లిపోయారు. బాధిత తండ్రి వారికోసం గాలించినా జాడ తెలియరాలేదు. శనివారం ఆయన నవాబుపేట ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా రైల్వే స్టేషన్‌లో ఉన్న ఇద్దరు పిల్లలను సంరక్షించారు. ఇన్‌స్పెక్టర్ తన ఛాంబర్‌లో బాధిత తండ్రికి అప్పగించారు. ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): పుట్టింటికి వెళ్లివస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..చంద్రబాబునగర్‌కు చెందిన విజయలక్ష్మి గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు భర్త సుబ్రహ్మణ్యం వైద్యచికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి ఈ నెల 19న చెన్నూరులోని తన పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పింది. అప్పట్నుంచి ఆమె జాడ తెలియరాలేదు. ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

నెల్లూరు(క్రైమ్): సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే రంగంలోకి దిగిన సైబర్‌టీం, సంతపేట పోలీసులు సాంకేతికత ఆధారంగా పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించారు. బాధితుడికి ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి తన ఛాంబర్‌లో శనివారం మొబైల్‌ను అందజేశారు. వివరాలు.. నగరంలోని కోటమిట్టకు చెందిన షేక్ షఫి బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి. ఆయన పదిరోజుల క్రితం బృందావనంలో వెళుతుండగా ఫోన్ పోయింది. దీంతో కేంద్ర టెలీకమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్)పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ బృందం, సంతపేట పోలీసులు సాంకేతికత ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించారు. రోజుల వ్యవధిలోనే ఫోన్‌ను గుర్తించి అప్పగించిన పోలీసు అధికారులు, సిబ్బందికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ డీ హిమవతి, సైబర్ క్రైమ్, సంతపేట ఎస్సైలు సురేష్, వేణుగోపాల్, సిబ్బంది నరసయ్య, గౌస్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

దాడిలో యువకుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలో, మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదుకాని ఓ యువకుడిపై ఆరుగురు దాడికి పాల్పడిన ఘటన కుమ్మరవీధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు..పెద్దబజారు కుమ్మరవీధికి చెందిన షేక్ హాజీ ఇంటీరియర్ డిజైన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన ఈ నెల 19న రాత్రి పనులు ముగించుకుని సుమారు 11.30 గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో అటకాయించి దాడిచేశారు. గాయాలపాలైన హాజీని అతని తమ్ముడు ఖైదర్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు చెప్పిన వివరాల మేరకు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

హాజీపై దాడి విచారకరం

నెల్లూరు(బారకాసు): షేక్ హాజీపై దాడి విచారకరమని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అన్నారు. హత్యాయత్నానికి గురై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ హాజీని పలువురు కార్పొరేటర్లతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజీపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయ న వెంట పార్టీ సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వ ర్లు, కార్పొరేటర్ ఎస్సార్ ఇంతియాజ్, గోగుల నాగరాజు, నాయకులు అల్లంపాటి జనార్దన్‌రెడ్డి, వడ్లమూడి చంద్ర, ఎస్డీ మున్వర్, సురేష్, కమల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సంస్కరణలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులతో మంత్రి కాకాణి

మనుబోలు : రాష్ట్రంలో పాలనా సంస్కరణలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, ఇవి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా? అంటూ ఆరా తీశారు. అంతకు ముందు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. జెడ్పీ హైస్కూల్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఇటీవల పదో తరగతిలో సత్తాచాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాకాణి మాట్లాడుతూ అక్కంపేటలో ఒకేచోట సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ మంచి ఆలోచనలు కార్యరూపం దాలిస్తే ఎలా ఉంటుందనేది అర్థం అవుతుందన్నారు. నాలుగేళ్లలో కోవిడ్ లాంటి ఎన్నో విపత్తులు సంభవించినా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో మీ కుటుంబాలకు మేలు జరిగినట్లు భావిస్తేనే నాకు అండగా నిలవండి అని చెప్పగలిగే సీఎం ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సంవత్సరానికి 15 లక్షల టన్నుల ధాన్యాన్ని అదనంగా మన రాష్ట్రం ఉత్పత్తి చేయగలిగిందని తెలిపారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువు విలయతాండవం చేసేదని, బాబు–కరువు కవల పిల్లలని ఎద్దేవా చేశారు.


మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

రూ.5.40 కోట్లతో అభివృద్ధి పనులు

ఒక్క అక్కంపేట గ్రామంలోనే నాలుగేళ్లలో రూ.5.40 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని మంత్రి కాకాణి తెలిపారు. గతంలో ఎంతో మంది శాసనసభ్యులు ఈ ప్రాంతంలో పనిచేశారని, వారి హయాంలో ఇచ్చిన దానికన్నా గడిచిన నాలుగేళ్లలో అధికంగా నిధులిచ్చామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి గ్రామంలో చేస్తున్న సేవలను ప్రశంసించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టమూరు నరసారెడ్డి, పలగాని శ్రీహరిరెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య, మన్నెమాల సుధీర్‌రెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆణిముత్యాలు’కు విద్యార్థినుల ఎంపిక

- స్టేట్ టాపర్ జాబితాలో వైష్ణవి


అచ్చి వైష్ణవి.


తేజస్విని


సాయిభార్గవి

పొదలకూరు : జగనన్న ఆణిముత్యాలు పథకానికి పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పది పరీక్షల్లో 592 మార్కులు సాధించిన వైష్ణవి స్టేట్ టాపర్ జాబితాకు ఎంపికై ఈనెల 31న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా నగదు పురస్కారాన్ని అందుకోనుంది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కూడా ఈనెల 25, 27వ తేదీల్లో వైష్ణవి నగదు పురస్కారాన్ని అందుకుంటుందని అధికారులు వెల్లడించారు. ఇదే పాఠశాలకు చెందిన ఆర్.తేజస్విని 584, కె.సాయిభార్గవి 582 మార్కులు సాధించి ప్రతిభ కనపరిచారు. వీరు నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపికయ్యారు. 592 మార్కులు సాధించిన వైష్ణవి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ కింద రూ.50 వేలు, జిల్లాస్థాయిలో రెండో ర్యాంక్ కింద రూ.30 వేలు, నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంక్ కింద రూ.15 వేలు నగదు పురస్కారం తీసుకోనుందని పాఠశాల హెచ్ఎం పెర్సిస్ వెల్లడించారు.

కామాక్షితాయికి కాసుల హారం బహూకరణ


బంగారు లక్ష్మీకాసుల హారాన్ని అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు బంగారు లక్ష్మి కాసుల హారాన్ని శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ సంగం మండలం వంగళ్లు గ్రామానికి చెందిన లేబూరు అఖిల్‌రెడ్డి, సుస్మిత దంపతులు సుమారు 79 గ్రాముల బంగారు లక్ష్మి కాసుల హారాన్ని అమ్మవారికి బహూకరించారని తెలిపారు. ఈ సందర్భంగా గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొగళ్లూరులో సైడ్ డ్రెయిన్ నిర్మాణం


పూర్తయిన పనులు

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన ఆయన రూ.10 లక్షల నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పర్యవేక్షణలో డ్రెయిన్ పనులను పూర్తి చేశారు. కోరిన వెంటనే అవసరమైన డ్రెయిన్ పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటి ట్యాంక్‌లను శుభ్ర పరచాలి

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : తాగునీటి ట్యాంక్‌లను తరచూ శుభ్రపరచాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని రేగడిచెలిక సచివాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, సంక్షేమ సహాయకులకు పలు సూచనలు చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. పనులకు వెళ్లే వారు ఉదయం 10 గంటల్లోపే పని ముగించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలైన కాపు నేస్తం, నేతన్న నేస్తం, అమ్మఒడి, వాహనమిత్ర, చేదోడు, ఈబీసీ నేస్తం, విద్యాదీవెన తదితర పథకాలకు సంబంధించి పొందిన లబ్ధిని వివరించి బయోమెట్రిక్ నమోదును పూర్తి చేయాల్సిన బాధ్యత సంక్షేమ సహాయకులదేనన్నారు. దీనికి వలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంపీడీఓ పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రఫీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మీదేవి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూజలు జరిపించారు. తిరిగి సాయంత్రం పల్లకి సేవ, పూజలు గావించారు. భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ వ్యవస్థపై ట్రెయినీ డీసీకి శిక్షణ

పొదలకూరు : ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ మహేష్ అల్కతుర్ పొదలకూరు మండలంలో రెండు వారాల పాటు శిక్షణ పొందే విధంగా జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ నగేష్ కుమారి శనివారం తెలిపారు. శిక్షణలో భాగంగా గ్రామస్థాయిలో వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరు తదితర అంశాలపై శిక్షణ పొందుతారన్నారు. ఈనెల 22 నుంచి జూన్ 4 వరకు ఆయన శిక్షణలో ఉంటారన్నారు. తర్వాత రెవెన్యూ శాఖపై అల్లూరు మండలంలో మరో రెండు వారాల పాటు శిక్షణ తీసుకుంటారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించండి

బుచ్చిరెడ్డిపాళెం : వేసవితాపం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుడు అహ్మద్‌బాబు అన్నారు. జొన్నవాడలోని పీహెచ్‌సీలో శనివారం ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, పిల్లలు బయటకు రావద్దని తెలిపారు. గొడుగులు వినియోగించడం శ్రేయస్కరమన్నారు. నీటితో పాటు శీతల పానీయాలు తరచూ తీసుకోవాలని సూచించారు. వాంతులు, తలనొప్పి, కాళ్ల నొప్పులు, జ్వరం ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి డాక్టర్ల సలహాలు పొందాలని కోరారు.

గీత కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు అన్నం శ్రీనివాసులు కుటుంబానికి గౌడ్ సేవాసమితి ట్రస్టు వారు శనివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల శ్రీనివాసులు తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ గుండెపోటుకు గురై మృతిచెందారు. తక్షణ సాయం కింద ట్రస్టు వ్యవస్థాపకుడు కోసూరు గోవిందయ్య ఆశన సాధన కోసం గౌడ్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, కోసూరు రాజశేఖర్‌గౌడ్ రూ.10 వేలను గతంలో అందజేశారు. అదనంగా మరో రూ.10 వేలను ప్రస్తుతం అందజేసి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా గౌడ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌గౌడ్, సభ్యులు తాళ్ల రాజాగౌడ్, అన్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయునికి లక్ష పూలతో అర్చన


వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఉభయకర్తలు


ప్రత్యేకాలంకరణలో వీరాంజనేయస్వామి

ముత్తుకూరు : వీరాంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం వాయుపుత్రుడిని లక్ష పూలతో ప్రత్యేక అర్చన చేశారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య లక్ష మల్లెపూలతో విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాల నడుమ పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. దివంగత చౌకచర్ల లక్ష్మణరెడ్డి–బుజ్జమ్మల జ్ఞాపకార్థం వారి తనయులు చౌకచర్ల భాస్కరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు


చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

కొడవలూరు : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖన పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం ద్వారా చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో చిన్నారుల ప్రతిభ ప్రశంసనీయమని కొనియాడారు. సెలవుల్లో పిల్లలందరినీ గ్రంథాలయాలకు పంపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

సండే స్కూల్‌తో బహుళ ప్రయోజనాలు


స్కూల్‌లో పిల్లలకు ఏర్పాటు చేసిన ప్రేమ విందు

కొడవలూరు : సండే స్కూల్లో పది రోజులపాటు నిర్వహించిన వేసవి శిబిరంతో చిన్నారులకు బహుళ ప్రయోజనాలున్నాయని సెంటినరి బాప్టిస్టు చర్చి పాస్టర్ డాక్టర్ ప్రేమ్‌నాథ్ తెలిపారు. నార్తురాజుపాళెంలోని చర్చిలో సండే స్కూలు సూపరింటెండెంట్ బి.సుప్రియ ఆధ్వర్యంలో పిల్లలకు పది రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో చిన్నారులకు దేవుని వాక్యాలను తెలియజేయడంతో పాటు పాటలు, నృత్యం, సంగీతం తదితర రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిబిరాన్ని పిల్లలంతా సద్వినియోగం చేసుకోవడం శుభ పరిణామమన్నారు. అనంతరం దామర్ల మధుసూదన్ ఆధ్వర్యంలో పిల్లలకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్ష, కార్యదర్శులు బట్టేపాటి సుదర్శనం, కోవూరు సురేష్, సంగీత శిక్షకులు టి.అహరోన్, దేవప్రసాద్, సభ్యుడు బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం ‘జగనన్న విద్యాకానుక’


స్టాక్ పాయింట్‌లోని పుస్తకాలను పరిశీలిస్తున్న జేడీ

- సమగ్ర శిక్ష రాష్ట్ర జేడీ వాసుదేవరావు

కొడవలూరు : జగనన్న విద్యాకానుకలు పేద విద్యార్థులకు వరమని రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ సీహెచ్ వాసుదేవరావు అన్నారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని జగనన్న విద్యాకానుకల స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యకు అవసరమైన సామగ్రిని విద్యాకానుకల రూపంలో అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అన్ని మండలాల్లోని స్టాక్ పాయింట్‌లకు విద్యా కానుకలు చేరినట్లు తెలిపారు. వీటిని వేసవి సెలవుల్లోనే ఆయా పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పాఠశాలల పునఃప్రారంభమైన రోజునే విద్యార్థులకు విద్యాకానుకలు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించి ఉన్నట్లు తెలిపారు. విద్యాకానుకల్లో భాగమైన యూనిఫాంలు, షూస్, పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు తదితరాలన్నీ స్టాక్ పాయింట్‌లకు సమృద్ధిగా చేరాయని పేర్కొన్నారు. ఆయన వెంట ఐటీడీఏ ఏఎంఓ శాంతకుమారి, ఎంఈఓ జి.వసంతకుమారి, సీఆర్పీలు జె.పెంచలరావు, ఎం.దయాకర్ ఉన్నారు.


పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

స్వచ్ఛసాగర్ సురక్ష సాగర్

- సముద్రతీరంలో వ్యర్థాల తొలగింపు


తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న పర్యావరణ శాఖ ఇంజనీర్ రాజశేఖర్ తదితరులు

ముత్తుకూరు : స్వచ్ఛసాగర్–సురక్ష సాగర్ నినాదంతో కృష్ణపట్నం తీరంలో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. జిల్లా పర్యావరణ శాఖ ఇంజనీర్ రాజశేఖర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా అటవీశాఖ, పోర్టు, జిల్లా పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 500 మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అదానీ కృష్ణపట్నం పోర్టు నిర్వాహకులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. సముద్రంలో జీవరాసులు సురక్షితంగా ఉండాలంటే తీరం పరిశుభ్రంగా ఉండాలన్నారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ జేవీఆర్ ప్రసాద్, పోర్టు డ్రై కార్గో హెడ్ మనీష్ దావే, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, అడ్మిన్ ఏజీఎం గంగాసతీష్, ఎన్విరాన్‌మెంట్ ఏజీఎం గుడివాడ శ్రీకాంత్, ఈహెచ్ఎస్ ఏజీఎం వేణుగోపాలరెడ్డి వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.